ముదిరాజ్‌లను 'బీసీ – ఏ'లో చేర్చాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డా. చొప్పరి శంకర్



బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న చొప్పరి శంకర్ ముదిరాజ్, నాయకులు

కాచిగూడ: ముదిరాజ్ కులస్తులను బీసీ (డీ) నుంచి బీసీ (ఏ)లో చేర్చాలని మన ముదిరాజ్ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మన ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం హైదర్‌గూడలోని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

◆ ముదిరాజ్‌ల సామాజిక, ఆర్థిక, స్థితిగతులను అర్థం చేసుకుని 2009లో అప్పటి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ముదిరాజ్‌లను బీసీ–డి నుంచి బీసీ–ఏలోకి మార్చుతూ జీవో 15 విడుదల చేసిందన్నారు. దీనిపై కొన్ని బీసీ కులాలు కోర్టుకు వెళ్లి దాన్ని అడ్డుకున్నాయని తెలిపారు. ముదిరాజ్‌లను బీసీ–ఏలో చేరిస్తే ఏ కులానికి నష్టం జరగదన్నారు.

◆ కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల ముందు కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో జీవో నం.15ను అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే చేపట్టనున్న బీసీ కులగణనలో బీసీ (డి) గ్రూపు నంబర్.19లో ఉన్న ముదిరాజ్, ముతరాసి, తెనుగు, బంటూ, కోలీ, కావలిల అందరిని ముదిరాజ్‌లుగా పరిగణించాలని కోరారు. లేని పక్షంలో ముదిరాజ్‌ల జనాభాను, బీసీల జనాభాను తక్కువ చేసి చూపించే అవకాశం ఉందన్నారు. బీసీ కులగణనలో తప్పులు జరిగితే అందుకు అధికారులు, సిబ్బందిని బాధ్యులను చేసే విధంగా బీసీ కమిషన్ స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నేతలు అందె బాలయ్య, సుధాకర్, మద్దెల సంతోష్, సలేంద్ర, శివయ్య, వికె మహేష్, ఈటెల భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా లోపం..

మ్యాన్‌హోళ్లు ధ్వంసం

అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టారీతిగా నిర్మాణాలు



రోజ్‌కాలనీలో పగిలిపోయి ప్రమాదంగా మారిన మ్యాన్‌హోల్

కవాడిగూడ: జీహెచ్ఎంసీ, జలమండలి అధికారుల పర్యవేక్షణ లోపం కాంట్రాక్టులకు వరంగా మారుతోంది. రూపాయలు కోట్ల నిధులు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు ఎక్కువ కాలం మనుగడలో ఉండటం లేదు. ముషీరాబాద్ సర్కిల్‌లో అస్తవ్యస్తంగా మారిన మ్యాన్‌హోళ్ల నిర్వహణ తీరుతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు.ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల చేతివాటంతో మ్యాన్‌హోళ్లను నిర్మించిన కొద్ది రోజుల్లో అవి కూలిపోతున్నాయి. మళ్లీ నిర్మించడం సర్కిల్‌లో లాభసాటి వ్యాపారంగా మారింది. మళ్లీ మళ్లీ మ్యాన్‌హోళ్లపై కప్పులను ఏర్పాటు చేస్తున్నప్పటికీ అవి పగిలిపోతూనే ఉన్నాయి.

ఏడాది పొడవున నోరు తెరిచే...

◆ ముషీరాబాద్ సర్కిల్‌లోని ఆరు డివిజన్లలో ఏ బస్తీలో చూసినా ఏదో ఒక మ్యాన్‌హోల్ నోరు తెరిచే కనిపిస్తోంది. కొన్ని మ్యాన్‌హోళ్లకు పై కప్పులు పగిలిపోయి, మరికొన్ని పూర్తిగా కుంగిపోయాయి. పలు చోట్ల ఆనవాళ్లే కనిపిస్తున్నాయి. ప్రమాదాలు జరగడం, కాలనీ, బస్తీవాసులు ఫిర్యాదు చేయడం ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లతో వీటిని నిర్మించడం అంతా అవుతున్న వాటి నాణ్యత ప్రశ్నార్థకంగానే మారుతోంది.

◆ కవాడిగూడలోని మల్లయ్య హోటల్ నుంచి చిత్రాలనగర్, బండమైసమ్మ, దోమలగూడ ఇలా ప్రతి మ్యాన్‌హోల్‌లో కొన్ని ధ్వంసమై ఉన్నాయి. పై కప్పులు పగిలిపోయి గుంతలు ఏర్పడి ఇబ్బందికరంగా మారాయి. దోమలగూడ గగన్‌మహల్ అభివృద్ధి చెందిన కాలనీలు అయినప్పటికి మ్యాన్‌హోళ్లు పొంగడం ఆ తరువాత కుంగిపోతున్నాయి. ప్రమాదకరంగా మారడంతో మళ్లీ కొత్తగా మ్యాన్‌హోళ్లను నిర్మిస్తున్నారు.

చేతినిండా పనులు...

◆ మ్యాన్‌హోళ్ల నిర్మాణం, వాటిపై కప్పుల ఏర్పాటు కాంట్రాక్టర్లకు మంచి లాభసాటిగా మారింది. కాలనీలు ప్రధాన రహదారుల్లో మ్యాన్‌హోళ్లు కుంగినా వాటి మూతలు పగిలినా, వెంటనే స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి, సర్కిల్ ఇంజినీర్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి మ్యాన్‌హోళ్ల సమస్యను పరిష్కరిస్తున్నారు. ఇదే కాంట్రాక్టర్లకు బాగా కలిసి వస్తుంది. సర్కిల్ అధికారులు సైతం అత్యవసర పనుల్లో పెట్టి వెంటనే పనులు జరిగేలా చర్యలు చేపడుతున్నారు. కానీ వాటి నాణ్యత విషయం పట్టించుకోకపోవడం తోనే వాటిని నిర్మించిన కొద్దిరోజులకే కూలిపోతున్నాయి. అయినప్పటికీ ఏ ఒక్క కాంట్రాక్టరుపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

శాస్త్రీయత ఏది.?

◆ రోడ్ల నిర్మాణం, మ్యాన్‌హోళ్ల ఏర్పాటులో శాస్త్రీయ లోపించడంతో లక్షలాది ప్రజాధనం వృథా అవుతోంది. మురుగు కాలువలు ఎక్కడి నుంచి ఎక్కడకు వెళ్తున్నాయి... వాటికి వరద నీరు ఎలా చేరుతోంది... మట్టి, చెత్త అందులోకి వెళ్లకుండా ఉండేందుకు ఇంజినీరింగ్ నైపుణ్యంతో మ్యాన్‌హోళ్లను తీర్చిదిద్దాలి అనేది ముషీరాబాద్ సర్కిల్‌లో ఎక్కడ కనిపించడం లేదు. ఈ లోపంతో వర్షాలు పడితే వరదతో రోడ్లన్నీ మునుగుతున్నాయి. ఈ ఇబ్బందులు రాకుండా ఉండాలంటే ప్రతి మ్యాన్‌హోల్‌ను జాగ్రత్తగా నిర్మించాలని నిపుణులు సూచిస్తున్నారు.

నాణ్యమైన మ్యాన్‌హోళ్లను నిర్మించాలి



నాణ్యత ప్రమాణాలతో మ్యాన్‌హోళ్ల నిర్మాణం చేపట్టాలి జనాభా అవసరాలకు అనుగుణంగా డ్రైనేజీ, మంచినీటి పైప్ లైన్ నిర్మించినప్పుడు మ్యాన్‌హోళ్లను కూడా అదే స్థాయిలో అభివృద్ధి చేయాలి. డివిజన్‌లో మ్యాన్‌హోళ్ల సమస్యను జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

– కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ

గ్లోబలైజేషన్‌లో కింది కులాలకు స్థానం లేదు

సమాజ్‌వాది పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి



పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సింహాద్రి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: గ్లోబలైజేషన్‌లో కింది కులాలకు స్థానం లేదని కొన్ని కులాలే లబ్ధి పొందుతున్నారని సమాజ్‌వాది పార్టీ తెలంగాణ అధ్యక్షుడు ప్రొ. సింహాద్రి అన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సమాజ్‌వాజ్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సింహద్రి మాట్లాడుతూ.. అన్ని రంగాలలో రెండు మూడు కులాలు మాత్రమే శాసిస్తున్నాయని అన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తూ ఆర్థిక అసమానతలను పెంచిపోషిస్తున్నారని విమర్శించారు. నేటి పాలకులకు రూల్ ఆఫ్ లా మీద గౌరవం లేదని, కోర్టులను కూడా ప్రభావితం చేస్తున్నారని విమర్శించారు.

◆ ఎస్సీ, ఎస్టీ, బీసీలను కూడా అణగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులు పెద్ద కులాల వారికే అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మన హక్కులను సాధించుకోవడంతో పాటు రాజ్యాంగ అధికారాన్ని చేజిక్కించుకోవాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో అరచాక పాలనను అడ్డుకోకుంటే కింది కులాలు బతకడం కష్టం అన్నారు. ఈ కార్యక్రమంలో సమాజ్‌వాజ్ పార్టీ అడ్వకేట్స్ ఫోరం జాతీయ అధ్యక్షుడు కిషన్ కన్నయ్యపాల్, ప్రొ. విశ్వేశ్వర్ రావు, పార్టీ ప్రధాన కార్యదర్శులు అక్కల బాలరాజుగౌడ్, శ్రీహరి ముదిరాజ్, డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు, ప్రొ. తాటికొండ వెంకటరాజయ్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో బీఆర్ఎస్ యువజన నాయకులు ముఠా జైసింహ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్కు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అల్పాహారంతో పాటు స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముఠా గోపాల్ మాట్లాడుతూ... గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామన్నారు. వీఎస్‌టీ నుంచి ఇందిరాపార్కు వరకు స్టీల్ బ్రిడ్జి వేయించామన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ మరమ్మతులు చేయించామని చెప్పారు. నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానని హామీ ఇచ్చారు. అనంతరం మాడేపల్లి సూర్యనారాయణ జయంతి సందర్భంగా జీహెచ్ఎంసీ సిబ్బంది, పార్కు సిబ్బందికి దుస్తులను పంపిణీ చేశారు. అదే విధంగా నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఆయా డివిజన్లలో ముఠా జైసింహ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్కు సీనియర్ ఉపాధ్యక్షులు బబ్లూ, అధ్యక్షులు ఆర్ వివేక్, హౌస్‌ఫెడ్ డైరెక్టర్ ఎ. కిషన్‌రావు, మాజీ అధ్యక్షులు ఎస్ రమేష్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, మనోహర్ రెడ్డి, మురళీకృష్ణ, వి.నాగభూషణం, శైలజామోహన్, నిమ్మరాజశేఖర్, టి.గోపిలతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

అనసూయకు డాక్టరేట్



కాచిగూడ: బద్రుక కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ ఇంగ్లిష్ అధ్యాపకురాలు ఎస్.అనసూయ 'పర్ఫెక్షన్ ఆఫ్ హ్యూమర్ ఇన్ ఆర్కే నారాయణాస్ రైటింగ్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను ద్రవిడియన్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. సర్దార్ పటేల్ డిగ్రీ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.శైలజ రాధాకృష్ణ పర్యవేక్షణలో ఎస్.అనసూయ డాక్టరేట్ పొందారు. బద్రుక ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మోహన్‌కుమార్, అధ్యాపకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

దోమలగూడ డీఐగా శ్రీశైలంనాయక్



కవాడిగూడ: దోమలగూడ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా 2009 బ్యాచ్‌కి చెందిన తేజావత్ శ్రీశైలం నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఎస్సైగా సనత్‌నగర్, కుషాయిగూడ, ఎల్‌బీనగర్, నాచారం, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, కేపీహెచ్‌బీలో పనిచేశారు. చిలకలగూడ డీఐగా రాచకొండ మహేశ్వరం జోన్‌లో ఎస్‌బి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన ఆయన గురువారం దోమలగూడ డీఐగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసులను త్వరితగతిన పరిశీలించి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

ఐసెట్ కన్వీనర్‌పై చర్యలు తీసుకోవాలి

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నాగేశ్వర్‌రావు డిమాండ్



ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ముషీరాబాద్: ఐసెట్–2024 కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కాకతీయ యూనివర్సిటీ ప్రొ. నర్సింహచారి అవినీతిపై విచారణ చేయాలని దోషి అని తెలితే తక్షణమే బాధ్యతల నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు.ప్రొ. నర్సింహచారిపై చర్యలు తీసుకోవాలని గురువారం తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. బాలకృష్ణారెడ్డికి ఆయన వినతిపత్రం అందజేశారు.

◆ అనంతరం నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ ఐసెట్ 2024 నిర్వహణ కోసం తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసిన రూ.92.76లక్షలలో సుమారు రూ.30లక్షలకు పైగా నిధులను ఎలాంటి నిబంధనలు పాటించకుండా అక్రమ పద్ధతిలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు.

◆ ఇప్పటికే ప్రముఖ పత్రికల్లో వార్తలు ప్రచురితం అయ్యాయని ప్రొ. నర్సింహచారి నైతిక బాధ్యత వహించి తక్షణమే పదవీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పాఠాలు నేర్పించాల్సిన ప్రొఫెసర్లు అవినీతికి పాల్పడడం దారుణం అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఎం.సుమంత్, రుక్మాత్‌పాషా, వెంకటేష్, శివ, పృథ్వీ, పవన్, సమీర్, వేణు, ఇంతియాజ్, మన్మాత్, షరీఫ్, రాజేష్ తదితరులున్నారు.

లంకబస్తీలో విద్యుత్ మీటర్ కనెక్షన్లు ఇవ్వండి

అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: నల్లకుంట డివిజన్ లంకబస్తీలో పలు ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న విద్యుత్ మీటర్ల మంజూరు ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. గాంధీనగర్(లంక బస్తీ)లో దీర్ఘకాలంగా పెండింగ్‌ల ఉన్న విద్యుత్ మీటర్ల సమస్యపై గురువారం గోల్నాక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే కాలేరు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పేదలు నివసించే లంక బస్తీలో మీటర్ కనెక్షన్లు ఇవ్వడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే మీటర్లు మంజూరు చేయాలని ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బస్తీలు, మురికివాడల్లో విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు వస్తే వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఏడీఈలు కె. శ్రీనయ్య, శ్రీనివాస్, నాగేశ్వరరావు, ఏఈ శ్రీనివాస్, శివశంకర్, లంకబస్తీ వాసులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఏ శక్తి అడ్డుకోలేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కరుణాకర్‌రెడ్డి

ముషీరాబాద్: అగ్రవర్ణ పేదలకు కల్పించిన పది శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ఏ శక్తులు అడ్డుకోలేదని ఓసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జి.కరుణాకర్‌రెడ్డి హెచ్చరించారు. ఐదేళ్ల క్రితం మేజర్ జనరల్ సంహ నివేదిక ఆధారంగా 126వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్లమెంట్‌కు ఆమోదించబడిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై కొంత మంది ఆక్రోశం వెలిబుచ్చుతూ వ్యతిరేకించడం తగదని ఆయన పేర్కొన్నారు.

అవకాశాలు కోల్పోయినా ఓసీలు రిజర్వేషన్లను వ్యతిరేకించలేదు..

◆ 70 సంవత్సరాల నుంచి రిజర్వేషన్ల వ్యవస్థతో లక్షల విద్యా, ఉద్యోగ అవకాశాలను ఓసీలు కోల్పోయినా ఏనాడు రిజర్వేషన్లను వ్యతిరేకించలేదని అన్నారు. ఇతర సామాజిక వర్గాలకు నష్టం కలగకుండా కేవలం అగ్రవర్ణాలలోని పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పిస్తే ఎందుకు కడుపు మంట అని ఆయన ప్రశ్నించారు. సామాజిక వివక్షిత అంతరించి ఆర్థిక వివక్ష కొనసాగుతున్న నేపథ్యంలో ఆర్థిక వెనుకబాటు ప్రాతిపదికన కల్పించిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని గుర్తు చేశారు.

జాతీయ ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి..

◆ దేశవ్యాప్తంగా ఆరుకోట్ల మందికి పైగా నిరుపేద ఓసీలను ఆర్థికంగా ఆదుకునేందుకు తక్షణమే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు లక్ష కోట్లు కేటాయించి జాతీయ ఓసీ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ వ్యతిరేకించడం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని అన్నారు.

ఈడబ్ల్యూఎస్ రద్దు చేయాలని చూస్తే ఊరుకోం..

◆ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై సమాజాన్ని తప్పుదోవ పట్టించాలని చూస్తే ఊరుకోమన్నారు. అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లను రద్దు చేయాలని చూస్తే మొత్తం రిజర్వేషన్ల వ్యవస్థను సమీక్షించాలని ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై తక్షణమే శాసన సభ, పార్లమెంటులో చర్చించి అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లపై సమాజంలో ఉన్న అపోహలను తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రెడ్డి సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు పటోళ్ల నాగిరెడ్డి, ఓసీ సంక్షేమ సంఘం నేత డాక్టర్ ఎస్.కరుణాకర్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి నాలాల సమస్య పరిష్కారానికి కృషి

ముషీరాబాద్: వరద నీటి నాలాల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారం తొలగించడంతో పాటు శిథిలావస్థకు చేరుకున్న నాలా పై కప్పు నిర్మాణ పనులను యుద్ధప్రతిపాదికన ఆధునీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్‌లో రూ.62 లక్షలతో వంద మీటర్ల పోడవున నాలాపై కప్పు నిర్మాణ పనులను ఎమ్మెల్యే స్థానిక కార్పొరేటర్ గౌస్ ఉద్దీన్‌తో కలిసి ప్రారంభించారు.

◆ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వరద నీటి నాలా గత 40 సంవత్సరాల క్రితం నిర్మించారని అన్నారు. నాలా పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడం వల్ల స్థానికంగా మట్టి పేరుకుపోవడం, పై కప్పు శిథిలావస్తకు చేరకోవడం వల్ల డివిజన్‌లోని శేఖర్‌రెడ్డి వీధి, రంగానగర్, పద్మశాలి కాలనీలో నిత్యం సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. వంద మీటర్ల వరకు నాలాను ఆధునీకరించడంతో ఈ వీధుల్లో సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు.

◆ రోడ్లపై మురుగునీటి ప్రవాహం లేకుండా నాలాలో మురుగు సాఫీగా వెళ్లేవిధంగా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు వై.శ్రీనివాస్‌రావు, డివిజన్ ఉపాధ్యక్షులు శంకర్‌గౌడ్, చాంద్, రాష్ట్ర మైనార్టీ కమిటీ మాజీ కార్యదర్శి షరీఫ్, డివిజన్ మాజీ అధ్యక్షులు మహ్మద్ అలీ, డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు మగ్బూల్, మీడియా సెల్ ఇన్‌చార్జీ ముచ్చకుర్తి ప్రభాకర్ పాల్గొన్నారు.

నత్తనడకన స్ట్రీట్ లైట్స్ క్రమబద్ధీకరణ పనులు

కాచిగూడ: స్ట్రీట్ లైట్స్ క్రమబద్ధీకరణ పనులు కాచిగూడ డివిజన్‌లో నత్తనడకన సాగుతున్నాయని కార్పొరేటర్ కన్నె ఉమా అన్నారు. గురువారం నింబోలిఅడ్డలోని కార్పొరేటర్ కార్యాలయంలో స్ట్రీట్స్ లైట్స్ డీఈ అశోక్, ఏఈ సామ్యులతో సమీక్ష నిర్వహించారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతో స్ట్రీట్ లైట్స్ వెలగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలగని స్ట్రీట్ లైట్స్‌కు వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. వివిధ ప్రాంతాల్లో అవసరమైన చోట నూతనంగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

తెలుగు రాష్ట్రాల్లో బీసీల ఐక్యతకు నిర్మాణాత్మక కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ర్యాగ అరుణ్

ముషీరాబాద్: రెండు తెలుగు రాష్ట్రాల్లో బీసీ సంక్షేమ సంఘం కమిటీలు వేసి బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి కృషి చేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ర్యాగ అరుణ్ తెలిపారు. గురువారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీసీ జాగృతిసేనా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణాయాదవ్, వేణు, కిశోర్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మహాధర్నాను విజయవంతం చేయాలి



బీజేపీ మహాధర్నా కరపత్రాలను చూపిస్తున్న వినయకుమార్

చిక్కడపల్లి: మూసీ బాధితులకు అండగా శుక్రవారం ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్న బీజేపీ మహాధర్నాను విజయవంతం చేయాలని సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయకుమార్ పిలుపునిచ్చారు. గురువారం డివిజన్‌లోని అరుంధతినగర్, సబర్మతినగర్‌లలో బీజేపీ నాయకులతో కలసి ఆయన కరప్రతాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ... కేంద్ర బొగ్గు,గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ మహాధర్నా జరుగుతోందన్నారు. గాంధీనగర్ డివిజన్ నుంచి మూసీ బాధితులు, ప్రజలు అధికంగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఎం.ఉమేష్, ఆనంద్‌రావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణకు పకడ్బందీ చర్యలు



చెత్త సేకరణ రిక్షాలను అందజేస్తున్న కార్పొరేటర్ పద్మ

అంబర్‌పేట: బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి తెలిపారు. డివిజన్‌కు మంజూరైన చెత్త సేకరణ రిక్షాలను గురువారం రెండో దఫాగా కార్మికులకు ఆమె అందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చెత్త సేకరించే వారికి ఇంటి యాజమానులు తడి, పొడి చెత్త అందించి సహకారించాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణతోనే ఆహ్లాదకర వాతవరణాన్ని పెంపొందిచవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బి.వెంకట్‌రెడ్డి, పారిశుద్ధ్య విభాగం అధికారులు సిబ్బంది ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు 12శాతం.. మరణాలు 9 పెరిగాయి!



డాక్టర్ కె.సుధీర్ కుమార్‌రెడ్డి

చిక్కడపల్లి: భారతదేశం అంతటా రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండటంతో పాటుగా ప్రజారోగ్య సమస్యగా పరిణమిస్తున్నాయని ఆర్థోపెడిక్, జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ కె.సుధీర్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లిలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు పెరగకుండా దేశవ్యాప్తంగా మెరుగైన భద్రతా చర్యలను తీసుకోవాలన్నారు. 2022లోనే దేశంలో 461,321 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని అన్నారు. వీరిలో 1,68491 మంది మరణించారు. అంతకు ముందు సంవత్సరంతో పోలిస్తే ప్రమాదాలు 12శాతం, మరణాలు 9శాతం పెరిగాయన్నారు. రోడ్డు భద్రతా ప్రమాణాలను అనుసరించటం వల్ల ప్రమాదాల ఫ్రీక్వెన్సీ, తీవ్రత రెండింటినీ ఘణనీయంగా తగ్గించవచ్చన్నారు. ప్రాణాలను రక్షంచగల రహదారి భద్రత ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు నివారణ ఆరోగ్య సంరక్షణ కూడా అవసరమని అన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాచిగూడ: నింబోలిఅడ్డ రోడ్డులో డిమార్ట్ వద్ద ఫుట్‌పాత్‌పై ఓ గుర్తుతెలియని వ్యక్తి (50) అనారోగ్యంతో మృతి చెంది ఉన్నాడు. కాచిగూడ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.